క్లుప్తంగా

ఏడు మద్యంసీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

భోగాపురం: మండల వ్యాప్తంగా మద్యం బెల్టు షాపులపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. గురువారం భోగాపురం పంచాయతీ పరిధిలోని మధుర గ్రామమైన అప్పన్నపేటలో తనిఖీలు చేయగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసి, ఏడు మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రవికుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, ప్రతాప్, మహేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పరిశీలన



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు రమణ

పూసపాటిరేగ: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దారు ఎన్వీ రమణ సూచించారు. మండలంలోని కొల్లాయివలస గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన గురువారం పరిశీలించి, సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే సమయంలో ఏ రైతు భూమి సర్వే జరుగుతుందో ఆ రైతు సర్వే వద్ద ఉండేలా చూడాలని చెప్పారు. సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు గణపతిరావు, గ్రామ సర్వేయర్లు చిన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి




అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: ప్రమాద బీమా సదుపాయం పొందేందుకు అసంఘటిత కార్మికులంతా ఈశ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి చంద్రశేఖరరావు కోరారు. మండలంలోని సతివాడ గ్రామ సచివాలయంలో కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. అలాగే ప్రమాద బీమా ప్రయోజనాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు చెక్..

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాకు చెక్ పెడుతున్నట్లు ఎస్పీ దామోదర్ గురువారం తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం ఆచూకీ కోసం వాహనాలతో గాలింపు చర్యలు ఉదయం చేపట్టామన్నారు. జిల్లా కేంద్రంలో 21 ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. దాసన్నపేట, ఎఫ్‌సీఐ గొడౌన్, కొత్తపేట, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్, మూడు లాంతర్ల జంక్షన్, కోట జంక్షన్, ఫూల్‌బాగ్, ఐస్ ఫ్యాక్టరీ, బాలాజీ సెంటర్, గంటస్తంభం, పాతబస్టాండ్, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి కార్యాలయం, సీఎంఆర్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, వై రోడ్డు, ఎత్తు బ్రిడ్జి, ఆర్‌అండ్‌బీ, కలెక్టర్ ఆఫీస్, జేఎన్‌టీయూ తదితర ప్రాంతాల్లో సీఐలు, ఎస్ఐలు వాహన తనిఖీలు ముమ్మరం చేసి, గంజాయి ఇతర మాదకద్రవ్యాల రవాణాను తనిఖీ చేశారన్నారు. ఎవరైనా ఎక్కడైనా మాదకద్రవ్యాలు తరలించినా, విక్రయించినా, వినియోగించినా శిక్షార్హులని హెచ్చరించారు.

సెమినార్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

నెల్లిమర్ల: సైన్స్ సెమినార్‌లో నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.లాస్య ప్రతిభ కనబరిచింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మండల స్థాయి సెమినార్ పోటీల్లో క్వాంటం యుగం ఆరంభం–అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై విద్యార్థిని ప్రసంగించి ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు హెచ్‌ఎం కామేశ్వరి, ఉపాధ్యాయులంతా విద్యార్థినిని అభినందించారు.

నత్తనడకన సీహెచ్‌సీ నిర్మాణం

- వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణం ప్రారంభం
- ప్రస్తుతం 70 శాతం మేర పూర్తయిన పనులు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తికాని భవనం
- అవస్థలు పడుతున్న వైద్యులు, రోగులు



నిర్మాణ దశలో సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం


నెల్లిమర్ల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) కొత్త భవన నిర్మాణం నత్తనడకన జరుగుతోంది. ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభమై ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదు. దీంతో పాత సీహెచ్‌సీలోని గదులు చాలక పోవడంతో అటు వైద్య సిబ్బంది..ఇటు రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకే గదిలో గర్భిణులు, సాధారణ రోగులు వైద్యసేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన కొత్త బెడ్లు, ఎక్స్‌రే మెషీన్, చిన్నపిల్లల వైద్య పరికరాలు నిరుపయోగంగా ఓ మూలన పడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసరంగా మెరుగైన వైద్యం కావాల్సిన వారు ఆస్పత్రికి వస్తే జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.5 కోట్ల వ్యయంతో పనులు..

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల విజ్ఞప్తుల మేరకు కొత్త సీహెచ్‌సీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో రూ.5 కోట్ల వ్యయంతో పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంది. ఆ మధ్యకాలంలో నిధులు విడుదల కాకముందు కొంతకాలం పనులు నిలిచి పోయాయి. ఆ తర్వాత పనులు ప్రారంభమై ప్రస్తుతం 70 శాతం మేర పనులు జరిగిపోయాయి. 2024 ఎన్నికల్లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నిర్మాణం పూర్తిపై నిర్లక్ష్యం వహించడంతో ఆస్పత్రి భవనం అందుబాటులోకి రాలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రోజుకు 200 నుంచి 300 ఓపీ..

ఇదే సీహెచ్‌సీకి మండల కేంద్రం సహా మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైద్యం కోసం వస్తుంటారు. రోజుకు 200 నుంచి 300 ఓపీ వస్తుందని, పాత ఆస్పత్రి భవనం రోగులకు సరిపోకపోవడంతో ఆస్పత్రి వరండాలోనే రోగులకు వైద్య తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో పాత ఆస్పత్రి భవనంలోని గదులు రోగులకు సరిపడక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన గదుల్లోనే తాము ఉండాల్సి వస్తోందని వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేసేందుకు తీసుకువచ్చిన కొత్త బెడ్లు

30 పడకల ఆస్పత్రిలో 50 మంది సిబ్బంది..

ప్రస్తుతం వినియోగంలోని పాత సీహెచ్‌సీ భవనంలో 30 పడకలు మాత్రమే ఉన్నాయి. ఇందులో 14 బెడ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఇదే ఆస్పత్రిలో 50 మందికి పైగా వైద్య సిబ్బంది ఉన్నారు. రోజూ 200కు తగ్గకుండా ఓపీలు వస్తాయి. వీరిలో పదుల సంఖ్యలో ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ఈ నేపథ్యంలో పాత ఆస్పత్రి సరిపోవడం లేదని అటు రోగులు ఇటు వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకైన గదుల్లో ఒకే బెడ్డుపై ఇద్దరేసి రోగులకు వైద్యం అందించడం కష్టంగా ఉందని చెబుతున్నారు.

నెలకు 20 ప్రసవాలు..

సీహెచ్‌సీలో నెలకు 20 మంది గర్భిణుల ప్రసవాలు జరుగుతాయి. ఈ క్రమంలో ఆస్పత్రిని ఆశ్రయించే గర్భిణులకు బెడ్లు లేకపోతే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త ఆస్పత్రి భవనం పూర్తయితే వాటిలో పెట్టేందుకు తీసుకువచ్చిన చిన్నపిల్లల వైద్య పరికరాలు, ఎక్స్‌రే మెషీన్, బెడ్లు అన్నీ ఓ మూలన పడి ఉన్నాయి. అవన్నీ కొత్త ఆస్పత్రి భవనం అందుబాటులోకి వస్తే గానీ వినియోగంలోకి రావు. అవి వినియోగంలోకి వస్తే గానీ రోగులకు మెరుగైన వైద్యం అందదని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే కొత్త ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



వినియోగంలోకి రాని ఎక్స్‌రే మెషీన్, చిన్నపిల్లల వైద్య పరికరాలు

ఒకే గదిలో గర్భిణులు, రోగులు..

సీహెచ్‌సీ కొత్త భవన నిర్మాణం పూర్తి కావడం లేదు. పాత ఆస్పత్రి భవనంలోని గదులు రోగులకు సరిపోవడం లేదు. ఒకే గదిలో గర్భిణులు, రోగులు వైద్యసేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త ఆస్పత్రి భవనం వినియోగంలోకి వస్తే రోగులకు మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉంటుంది.

–డాక్టర్ తిరుమలాదేవి,
సూపరింటెండెంట్, నెల్లిమర్ల సీహెచ్‌సీ

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పూర్తి



రెల్లివలసలో ప్రారంభానికి సిద్ధమైన శ్మశానవాటిక

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస, చల్లవానిపేట గ్రామాలకు సంబంధించి, రెల్లివలసలోని శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, త్వరలో దీనిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీపీ మహంతి కల్యాణి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంతో కాలంగా శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు లేక ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరు చేయించి బర్నింగ్ షెడ్ ఏర్పాటు సహా షెడ్‌లో స్ట్రక్చర్, టైల్స్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. త్వరలోనే దీనిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గారిచే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.


ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి



పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎంపీ శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని రాకోడు, పినవేమలి గ్రామాల్లో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటను పొట్టదశలో ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యలను ఆయన తెలియజేశారు. పొలంబడిలో భాగమైన వ్యవసాయ పర్యావరణ విశ్లేషణా పద్ధతి, పొలంలో మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాసరావు, ఏఈవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశువైద్య శిబిరానికి పశువులు తీసుకువచ్చిన రైతులు

పూసపాటిరేగ: పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువులకు ఏ వ్యాధి వచ్చినా వెంటనే పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని పశువైద్య శాఖ జేడీ(జాయింట్ డైరెక్టర్) కె.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని తాళ్లపేటలో పశువైద్య శిబిరం గురువారం నిర్వహించి, 157 పశువుల ఆరోగ్యం తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానాకాలంలో పశువులు సహా ఇతర మూగజీవాలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, వాటికి మంచి దాణా అందిస్తూ అవి ఉండే స్థలాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఎన్.దామోదర్, గరివిడి వెటర్నరీ, పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి జగదీష్, పశువైద్యాధికారులు ఈశ్వరశ్రీనివాస్, ప్రవీణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డీవీజీ శంకరరావు



విజయనగరం రూరల్: సీపీఆర్ చేయడాన్ని వివరిస్తున్న వైద్యుడు

విజయనగరం: ప్రతిఒక్కరూ సీపీఆర్(కార్డియో పల్మనరీ రీసససియేషన్)పై అవగాహన కలిగి ఉండడం తప్పనిసరి అని మాజీ ఎంపీ, మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. నగరంలోని 42వ డివిజన్ అయ్యన్నపేట వాకింగ్ ట్రాక్ వద్ద శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన..గుండెపోటుకు గురైన వ్యక్తికి తక్షణమే సీపీఆర్ చేయాలని, దీనిపై అందరూ అవగాహన కలిగి ఉంటే ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అనంతరం సీపీఆర్ ఏ విధంగా చేయాలి..దాని ప్రయోజనాలను వివరించారు. అందరూ రోజూ వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తీసుకుంటే గుండె సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు కె.సత్యనారాయణ, పి.అప్పలరాజు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ జేవీ(గురజాడ విశ్వవిద్యాలయం)లో ఎన్ఎస్ఎస్, విజయనగరం వైద్య కళాశాల ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు జైధీర్..సీపీఆర్ చేసే విధానాన్ని క్షుణ్నంగా తెలిపారు. అనంతరం దాని ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వితరణ

విజయనగరం క్రైమ్: నేరాలకు పాల్పడిన వారిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తున్న డ్రోన్‌ను మా మహామాయ లిమిటెడ్ కంపెనీ ఎండీ అశోక్‌కుమార్ అగర్వాల్ పోలీస్ శాఖకు గురువారం వితరణ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఆయన కలిసి డ్రోన్‌ను అందజేశారు. నేరాల నియంత్రణలో పౌరులు భాగస్వాములవుతుండడం ఆనందంగా ఉందని ఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు.

యాక్సిక్ బ్యాంక్‌లో ఖాతా తెరవండి

విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది అంతా యాక్సిస్ బ్యాంక్ ఖాతా(అకౌంట్) తెరవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం మాట్లాడా రు. ప్రస్తుతం ఉన్న పారిశుద్ధ్య కార్మికుల బ్యాంకు ఖాతాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందరూ యాక్సిస్ బ్యాంక్ అకౌంట్‌లు ఓపెన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

సోమరాజు మృతి పట్ల మంత్రి కొండపల్లి సంతాపం

విజయనగరం అర్బన్: గంట్యాడ మండలం, చంద్రంపేట గెడ్డ వద్ద గల్లంతైన విజ్జపు సోమరాజు మృతి పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెండు రోజుల క్రితం అకాల వర్షాలకు విజయనగరం–బొడ్డవర దారిలోని చంద్రంపేట కాజ్‌వేను దాటుతుండగా ఆర్.వసంత గ్రామానికి చెందిన సోమరాజు గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడితే గురువారం అతడి మృతదేహం లభ్యమైంది. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్..ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించి, బాధిత కుటుంబాన్ని బాగా చూసుకోవాలని గ్రామస్తులకు ఫోన్‌లో తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



ఐవోటీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ సుబ్బారావు

విజయనగరం రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూ జీవీ వీసీ వీవీ సుబ్బారావు సూచించారు. చెన్నైకు చెందిన ఎన్ఐఈఎల్ఐటీ, సీఎస్‌సీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)పై రెండు వారాల పాటు శిక్షణ తరగతుల బ్రోచర్ గురువారం ఆవిష్కరించారు. డిజిటల్ గవర్నెన్స్, పబ్లిక్ సర్వీసుల్లో ఐవోటీ సాంకేతిక ప్రాముఖ్యాన్ని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖలోని అధికారులు, సిబ్బందిని మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్లు జి.స్వామినాయుడు, రావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన



తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం నిరసనకు దిగారు. పూసపాటిరేగ తహసీల్దారు కార్యాలయం ఎదుట నిల్చొని తమ సమస్యలపై నినదించారు. రూ.15 వేల వేతనం ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, యూనిఫాం, గుర్తింపుకార్డులు అందివ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, రాజకీయ ఒత్తిళ్ల చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణతో కలిసి తహసీల్దారు ఎన్వీ రమణకు వినతిపత్రం అందజేశారు. –పూసపాటిరేగ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి నవంబరు 12వ తేదీ వరకు చేపట్టే బస్సుయాత్ర వాల్‌పోస్టర్‌లను జిల్లా కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న విజయనగరంలో భారీ బహిరంగ సభ ఉంటుందని, విద్యార్థులు ఎదుర్కొంటున్న అధిక ఫీజుల అవస్థలు, స్కాలర్‌షిప్ సమస్యలు, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇబ్బందులపై చర్చించడం జరుగుతుందన్నారు. చాలాచోట్ల పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు లేక ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించి భారీగా ఫీజులు చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికీ విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదని గుర్తు చేశారు. ఈ సమస్యల పరిష్కారానికే బస్సుయాత్ర చేస్తున్నామన్నారు.

–విజయనగరం గంటస్తంభం

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచండి



వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, అందులోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారం అందివ్వాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని దాసన్నపేట, రాజీవ్‌నగర్ కాలనీల్లోని బీసీ బాలురు, బాలికల హాస్టళ్లను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, భోజన శాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం వండిపెట్టాలని, వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు వండిపెట్టిన భోజనాలు రుచి చూసి పరిశీలించారు. రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు అందివ్వాలని సిబ్బందికి తెలిపారు.

–విజయనగరం లీగల్

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లోకల్ గవర్నెన్స్ చాంబర్ ప్రతినిధులు

విజయనగరం రూరల్: కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని లోకల్ గవర్నెన్స్ చాంబర్ ప్రతినిధి బృందం కలెక్టరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. లోకల్ గవర్నెన్స్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎంపీపీ శ్రీరాములునాయుడు, నెల్లిమర్ల జెడ్పీటీసీ సన్యాసినాయుడు, పీరుబండి జైహింద్‌కుమార్, రీమాపేట సర్పంచ్ మహేష్, కొండకరకాం చాంబర్ సభ్యుడు రాంబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లంతా కలెక్టర్‌ను కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. తమవంతు సహకారం కూడా అందిస్తామన్నారు.

అంబలం పూజకు సర్వం సిద్ధం



అంబలం పూజ వివరాలు వెల్లడిస్తున్న గురుస్వామి సూర్యపాత్రో

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అంబలం పూజకు పైడిమాంబ దీక్షా ఆది పీఠం నేతృత్వంలో కూట కూడలిలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు దీక్షాపీఠం వ్యవస్థాపక గురుస్వామి ఆర్.సూర్యపాత్రో గురువారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమయ్యే అంబలం పూజలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని, అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు. ఆయన వెంట గురుస్వాములు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, కె.రంజిత్, దీక్షధారులు ఉన్నారు.

ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులతో పోలీసులు

విజయనగరం క్రైమ్: నగరంలోని ఓ ఇంట్లో బంగారం చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ నెల ఏడో తేదీన నగరంలో జరిగిన పైడితల్లి సిరిమానోత్సవానికి అద్దెపల్లి వారి వీధికి చెందిన రాధ వెళ్లిపోగా ఆమె ఇంట్లోకి చొరబడిన దుండగులు 19 గ్రాముల బంగారం, 1339 గ్రాముల వెండి, టీవీ, మోటార్‌ను పట్టుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి, మంగరాజు, రాంబాబు, పైడిరాజులను పట్టుకుని వారి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న జడ్జి బబిత

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు భవన సముదాయంలో మహిళలకు వచ్చే గర్భాశయ కేన్సర్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. జడ్జి ఎం.బబిత మాట్లాడుతూ ప్రతి మహిళ తమకు వచ్చే కేన్సర్‌లు, వాటి నివారణ చర్యలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గర్భాశయ కేన్సర్ బారినపడకుండా హెచ్‌పీవీ అనే వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. తొమ్మిదేళ్ల వయసు దాటిన బాలికల దగ్గర నుంచి 26 ఏళ్ల లోపు వయసు మహిళలంతా వివాహానికి ముందే ఈ వ్యాక్సిన్ వేసుకోవడం మంచిదన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకుంటే ఏ రకమైన కేన్సర్ మనదరికి చేరదన్నారు. వ్యాక్సిన్ ఎప్పుడు ఎవరెవరు వేయించుకోవాలి..దాని ప్రయోజనమేంటన్నది డాక్టర్ స్రవంతి, గైనకాలజిస్ట్ చాముండేశ్వరిలు వివరించారు.

రామతీర్థాన్ని దర్శించిన జీయర్ స్వాములు



రాములోని సన్నిధిలో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ సంపత్ కుమార్ జీయర్ స్వామి, రామానుజ బృందావన జీయర్ స్వామి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ సంపత్ కుమార్ జీయర్ స్వామి, రామానుజ బృందావన జీయర్ స్వామి గురువారం సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వైదిక సిబ్బంది శాస్త్రోక్తంగా ఆహ్వానించారు. మంగళ వాయిద్యాల నడుమ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం సీతారామస్వామి సన్నిధిలో విశేష అర్చనలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో భక్తులకు వేదవాక్కులు వినిపించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.